మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి

శుక్రవారం 26 జనవరి 2024 పేజీలు 8

## వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**బాలానగర్ మేజర్‌న్యూస్:** చింతకుంటతండా గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం పల్లె ప్రకృతి వనం క్రీడా ప్రాంగణం స్మశాన వాటికతో పాటు గుండేడు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం మరియు పల్లె ప్రకృతి వనాన్ని గురువారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లెల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసి రాబోయే రోజుల్లో ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకుంట గుండేడు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజా ప్రతినిధులు అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమరమా.. ఇంకా సమయమా?

## 'పంచాయతీ' రిజర్వేషన్లపై ఉత్కంఠ



**ఉండవెల్లి మేజర్‌న్యూస్:** పంచాయతీ ప్రస్తుత పాలకవర్గాల పదవి కాలం 2024 జనవరి 31 తో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం యంత్రాంగాన్ని సమయాత్తపరుస్తూ పంచాయతీ పోరుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పోలింగ్ సిబ్బంది వివరాలను సమర్పించాల్సిందిగా ఇప్పటికే జిల్లా కలెక్టర్లు కు,జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30లోగా 'టీ పోల్ ' యాప్ లో అప్లోడ్ చేయాలని పేర్కొంది. శాసనసభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారి వివరాలను అధికారులు యాప్ లో పొందుపరుస్తుండగా.. ఇప్పటివరకు రిజర్వేషన్ల అంశం తేల్చకపోవడం లోక్సభ ఎన్నికలు కూడా వస్తున్నడంతో వీటి పై సందిగ్ధత నెలకొంది.

**సర్పంచి పదవులపై ఆశలు...** దాదాపు ఈ ఏడాదంతా ఎన్నికల పండగ వాతావరణం నెలకొనే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీ పార్లమెంటు మండల జిల్లా ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు వరుసగా జరగనున్న విషయం తెలిసిందే. కాగా పంచాయతీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రామాల్లో రాజకీయ వేడి మొదలైంది. ముందుగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టారు. పోటీలో ఉండాలంటే ఇప్పటినుంచే ప్రజలకు చేరువ కావాలి. ఒకవేళ రిజర్వేషన్లు మారితే పెట్టిన ఖర్చు వృధా అవుతుంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఖర్చులు అమాంతం పెరిగే అవకాశం లేకపోలేదు.. ముందుకు వెళ్లాలా.. రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాత అడుగు ముందుకు వేయాలా? అనే సంశయంలో ఉన్నారు. ఇక పార్టీల నాయకులు సైతం ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలు పార్టీల గుర్తులపై జరగకున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రధాన పార్టీల అండదండలతోనే అభ్యర్థులు బరిలో నిలుచుంటారు. ఈ క్రమంలోఅసెంబ్లీ ఎన్నికల్లో తాము పడిన కష్టానికి ప్రతిఫలంగా తగిన సహకారాన్ని అందించాలని ఆశావహులు నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు.

**బ్యాలెట్ పోరు మరో ప్రహసనం..** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అసెంబ్లీ ఎన్నికల ఓటర్ జాబితానే ప్రమాణికంగా తీసుకుంటారు. అయితే దాన్ని పంచాయతీలు, వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. కొత్తగా అభ్యంతరాల స్వీకరణ పరిశీలన

మిగతా 2లో

**ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి...**

గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'పంచాయతీ రాజ్ చట్టం -2019' ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్లపాటు వర్తిస్తాయని పేర్కొంటుంది. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక ఏమైనా మార్పులు చేస్తుందా? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రతిపాదకనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రస్తుత చట్టంలో మార్పులు చేయాలి. ఇది జరగాలంటే మరో కొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ ప్రక్రియ మొత్తం జరగాలంటే సమయం పడుతుంది. మరోవైపు పాలకవర్గాల పదవి కాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికల ప్రక్రియను కమిషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు అంత సమయం లేదు ఆయా పరిణామాల నేపథ్యంలో స్థానిక సంగ్రామం సకాలంలో జరగకపోవచ్చు? అనే అభిప్రాయం అధికారులు రాజకీయ పార్టీల్లో వ్యక్తం అవుతుంది. ఇదే జరిగితే... పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రావడం అనివార్యమవుతుంది.

## గ్రామాల అభివృద్ధితో
# దేశభవిష్యత్తు నిర్మాణం

- 20లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన జిపి భవనం ప్రారంభం
- 20 లక్షల ఎంపీ నిధులతో అండర్ డ్రైనేజీ
- ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి



**తెలకపల్లి మేజర్‌న్యూస్:** గ్రామాల అభివృద్ధి దేశ భవిష్యత్తుకు నిర్మాణ బాటలు వేస్తుందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు గురువారం మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో ఆర్జిఎస్ఏ 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో పేద ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుందని ప్రతి పేదవాడికి లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని అన్నారు. అదేవిధంగా రామ్ రెడ్డిపల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు కోసం 20 లక్షల రూపాయల ఎంపీ నిధులతో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో

మిగతా 2లో

# వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలి

## - జిల్లా కలెక్టర్ జి రవి నాయక్



**మహబూబ్‌నగర్, మేజర్ న్యూస్:** ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నూటికి నూరు శాతం ఓటు హక్కును వినియోగించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి జి. రవి నాయక్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా

మిగతా 2లో



# పానగల్ ఎంపీపీపై హత్యయత్నం

## : కేసు నమోదు

**పానగల్ (మేజర్ న్యూస్):** పానగల్ మండల పరిషత్ అధ్యక్షుడు మామిళ్ళపల్లి శ్రీధర్ రెడ్డిపై బుధవారం రాత్రి హత్యయత్నం చేసిన సంఘటనలో పానగల్ మండల కేంద్రానికి చెందిన ఆది శ్రీనివాసుల, ఆది స్వామి అనే ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేయడం జరిగిందని పానగల్ ఎస్సై వేణు తెలిపారు. ఎస్సై వేణు తెలిపిన వివరాల ప్రకారం పానగల్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు దళిత బంధు రాలేదని గత కొంతకాలంగా ఎంపీపీ శ్రీధర్ రెడ్డి పై కక్ష పెంచుకుంటూ వచ్చారని తెలిపారు. పథకం ప్రకారంగా డీజిల్ డబ్బాతో వచ్చిన ఇద్దరు లాండ్రీ షాప్ ముందు కూర్చున్న శ్రీధర్ రెడ్డి పై ఒక్కసారిగా దాడి చేసి డీజిల్ మీద పోసేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న గ్రామస్తులు దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను పక్కకు లాగేసారని తెలిపారు, బాధితుడు ఎంపీపీ శ్రీధర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు

మిగతా 2లో



పానగల్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు



ఎంపీపీ శ్రీధర్ రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం

సూర్య
www.suryaa.com
శుక్రవారం
26 జనవరి 2024

## సమరమా.. ఇంకొంత సమయమా?

(మొదటి పేజీ తరువాయి)

జరిపి తుది జాబితా వెల్లడించడం తప్పనిసరి. ఈ ప్రక్రియకు కనీసం నెల రోజుల సమయం పడుతుంది. ఎన్నికల విభాగం అధికారులు చెబుతున్నారు. శాసనసభ ఎన్నికల జాబితాలో దొర్లిన తప్పుల సవరణకు సంబంధించి ఓటర్లకు అవకాశం ఇవ్వాలి. ఉన్నతధికారుల ఆదేశాల ప్రకారం పంచాయతీ పోరుకు తుది ఓటరు జాబితా ను పకడ్బందీగా సిద్ధం చేసే వీలుంది. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ పెట్టెలు సేకరించాలి. బ్యాలెట్ పత్రాలనుముద్రించాలి. ఇదంతాజరగాలంటే ఇప్పుడున్న సమయం కూడా చాలాదన్న అభిప్రాయం ఎన్నికల అధికారుల్లో వ్యక్తమవుతుంది.

## దేశభవిష్యత్తు నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, జెడ్పిటిసి సుమిత్ర, ఎంపీపీ కొమ్ము మధు, వైస్ ఎంపీపీ విజయనిర్మల, సింగిల్ విండో చైర్మన్ డి భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మామిడాల లావణ్య మధుసూదన్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, డైరెక్టర్లు వివిధ శాఖల అధికారులు గ్రామాల ప్రజాప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

## పానగల్ ఎంపీపీపై హత్యయత్నం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు ఎస్సై వేణు తెలిపారు.

***పోలీస్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ నాయకుల ధర్నా..***

పానగల్ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్ రెడ్డి పై దాడి చేసిన ఆది శ్రీను, ఆది స్వామి అనే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా పార్టీ అధ్యక్షుడు వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యలు మంచి పద్ధతి కాదని అన్నారు. ఇద్దరు వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామాల పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

***ఎంపీపీ మామిళ్ళపల్లిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బీరం..***

పానగల్ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్ రెడ్డి పై హత్యాయత్నం జరిగిన విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గురువారం గ్రామానికి వచ్చి ఎంపీపీ మామిళ్ళపల్లిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే భీరం మాట్లాడుతూ ఎంపీపీ శ్రీధర్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను మాజీ ఎమ్మెల్యే కోరారు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగినేని అభిలాష్ రావు ఉన్నారు.

## వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గడచిన 14 సంవత్సరాల నుండి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ఎన్నికల సంఘం తీసుకొస్తున్న మార్పులు, సంస్కరణల పై అవగాహన కల్పించడంతోపాటు, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నికలలో పాల్గొనడంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాల స్థాయిలోని పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి వారిలో ఓటరు అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం అనేక రకాల సంస్కరణలు తీసుకురావడం జరిగిందని, గతంలో సంవత్సరానికి ఒకసారి మాత్రమే 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం ఉండిందని, కానీ ఇప్పుడు అది సంవత్సరంలో నాలుగు సార్లు ఓటు హక్కు నమోదు చేసుకునే సంస్కరణలు తీసుకొచ్చిందని, ఇలాంటివి ఎన్నో మార్పులు వచ్చాయని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవిన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం కార్యక్రమానికి హాజరైన వారికి సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఓటు ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సీనియర్ సిటిజన్లను శాలువాతో సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఫోటో ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అంతేకాక పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. డిఆర్ఓ కేవివి రవికుమార్, జిల్లా అధికారులు, పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

### - పోలీసుల అదుపులో మానవ మృగం

### - ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

**చిన్నచింతకుంట. మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు పట్టణంలో ఓ కాలనీలో ఐదు సంవత్సరాల వయసు ఉన్న చిన్నారి బాలికపై 17 సంవత్సరాల వయసు ఉన్న బాలుడు అత్యాచారంకు పాల్పడినట్లు సీఐ శ్రీ కె ఎస్ రత్నం ఎస్సై నరేందర్ తెలిపారు. బుధవారం రాత్రి ఈ సంఘటన విషయమై బాధిత చిన్నారి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుధవారం రోజు రాత్రి 11 గంటలకు కారకుడు అయినా 17 సంవత్సరాల బాలుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చిన్నారి బాలికకు వైద్య చికిత్సలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# 3 నెలలకు చంటి పిల్లాడి కిడ్నాప్ యత్నం

### - తల్లి ప్రతిఘటనతో పరారైన దుండగుడు - తీవ్ర కలకలం రేపిన కిడ్నాప్ ఉదాంతం

### - జడ్చర్ల పట్టణంలో ఘటన - దుండగుల కొరకు పోలీసుల గాలింపు





**జడ్చర్ల, మేజర్ న్యూస్:** పట్టపగలే 3 నెలల చంటి పిల్లాడిని కిడ్నాప్ చేయడానికి గుర్తు తెలియని దుండగుడు యత్నించగా బాలుడి తల్లి తీవ్రంగా ప్రతిఘటించడంతో బాలుడిని వదిలి పరారయ్యాడు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. జడ్చర్ల పట్టణం తాలుక క్లబ్ రోడ్ విద్యానగర్ కాలనీలో మధ్యాహ్నం పూట ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి రవీందర్ గౌడ్ అనే వ్యక్తి ఇంటి వద్ద స్కూటీని నిలిపి ఒక వ్యక్తి స్కూటీపై ఉండగా మరో వ్యక్తి రవీందర్ ఇంట్లోకి చొరబడి ఊయలలో ఉన్న మూడు నెలల మణిదీప్ అనే చంటి పిల్లాడిని చేతిలోకి తీసుకొని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో రవీందర్ భార్య కవిత ఒంటరిగా ఇంట్లో ఉండడంతో రవీందర్ బయట ఉన్నాడని బాబుకు ఆరోగ్యం బాగాలేదని హాస్పిటల్‌కి తీసుకురమ్మన్నాడని చెప్పి బాలుడిని బలవంతంగా ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో అప్రమత్తమైన రవీందర్ భార్య కవిత దుండగుడి చేతిలో నుండి బాబుని తీసుకునే ప్రయత్నం చేసినా పట్టు విడకపోవడంతో కిడ్నాప్ కి యత్నించిన వ్యక్తిపై చేయి చేసుకుంది. దీంతో భయభ్రాంతులకు గురైన దుండగుడు అక్కడనుండి పరారయ్యాడు. చుట్టుపక్కలవారు అప్రమత్తమై వెంటనే 100 డయల్ కు ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంబంధిత ఘటనపై దర్యాప్తు చేపట్టారు. కాగా తమ బాబును కిడ్నాప్ చేయడానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు రవీందర్ జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ నేపథ్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. రవిందర్ తో కలిసి క్లబ్ రోడ్ లో గల పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలు, ఆ మార్గంలో ఉన్న సీసీ కెమెరాలు ద్వారా దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా పట్టపగలే జడ్చర్ల పట్టణంలో మూడు నెలల చిన్నారిని కిడ్నాప్ యత్నించడం చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల చిన్నారిని కిడ్నాప్ చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. ఇది గుర్తుతెలియని బయటి వారి పనేనా? లేక రవీందర్ కు సంబంధించిన ఇంటి మనుషుల పనేనా అని పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు త్వరగా విచారణ చేపట్టి దుండగులను గుర్తించాలని రవీందర్ దంపతులతో పాటు పట్టణ ప్రజలు కోరారు.

## చిట్టెం నర్సిరెడ్డి కాలనీ లబ్ధిదారులకు,కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్లు నిర్మించి ఇస్తాం

### - కుంభం శివకుమార్ రెడ్డి





**నారాయణపేట మేజర్ న్యూస్ :** చిట్టెం నర్సిరెడ్డి కాలనీ లబ్ధిదారులకు,కాంగ్రెస్ ప్రభుత్వం ఆయాంలో ఇండ్లు నిర్మించి ఇస్తాం అనీ,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి చిట్టెం నర్సిరెడ్డి కాలనీ లబ్ధిదారులకు హామీ ఇవ్వడం జరిగింది ఈసందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా పార్టీ కార్యదర్శి బి రాము మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని వల్లంపల్లి శివారులో 48 సర్వే నంబర్ లో,508 మందికి,ఇండ్ల స్థలలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాల పట్టాలను ఇవ్వడం జరిగింది. గురువారం చిట్టెం నర్సిరెడ్డి కాలనీని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కుంభం శివకుమార్ రెడ్డి సందర్శించడం జరిగింది. స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు కుంభం శివకుమార్ రెడ్డి లబ్ధిదారులకు మీ ఇళ్లకు కేటాయించిన స్థలాలు మీకే ఉంటాయని,ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు కూడా మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, జిల్లా నాయకులు యాదగిరి, మండల కార్యదర్శి బి నరసింహ, టౌన్ కార్యదర్శి కించ నారాయణ, డివిజన్ నాయకులు, ప్రశాంత్, నారాయణ, రాములు, హాజీ మలంగ్, వెంకట్ రాములు, ఫిర్మోదిన్, మైనార్టీ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు సాధిక్, సలీం, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్, వెంకటేష్ లబ్ధిదారులు 150 మంది పాల్గొన్నారు

## కేజీబీవీ పాఠశాలకు ఉపాధ్యాయుడు మైక్ సెట్ వితరణ



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కు మండల పరిధిలోని లాల్ కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో హిందీ పండితుడి గా బోధించే ఉపాధ్యాయుడు మైక్ సెట్ వితరణ చేశారు తల్లి పద్మావతి నిరక్ష్య రాసులు కావడంతో కస్తూర్బా గాంధీ పాఠశాలలో నిరుపేద బాలికలు శ్రద్ధగా చదువుకోవాలని ఉద్దేశంతోనే బాలికల దినోత్సవం సందర్భంగా సహాయము చేయాలని కోరిక మేరకు రూ.15000. వేలతో మైక్ సెట్ వితరణ చేయడం జరిగిందని హిందీ పండితుడు ఉపాధ్యాయులు విజయకుమార్ తెలిపారు కేజీబీవీ పాఠశాలకు మైక్ సెట్ వితరణ చేసినందుకు హిందీ పండితుడు తల్లి పద్మావతికి పాఠశాల ఎస్ ఓ హేమలత పాఠశాల ఉపాధ్యాయులు.విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పి ఆర్.టి.యు. టి.యస్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి లాల్ కోట జిహెచ్ఎం మురళీకృష్ణ ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్ కేజీబీవీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

### - ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. పాలిటెక్నిక్ కాలేజీ గ్రౌండ్స్ లో ఏర్పాట్లను గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఏర్పాట్లు పరిశీలించారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్. తిరుపతి రావు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. 75వ గణతంత్ర వేడుకలు అద్భుతంగా ఉండాలని సూచించారు. వేడుకకు అవసరమైన వేదిక, స్టాల్, ప్రజలు కూర్చోడానికి పండాల్స్, పోలీస్ పరేడ్ నిర్వహణ వంటి ఏర్పాట్లను పరిశీలించారు.

# అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొండనాగులలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ తరగతులు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రం, కోఆర్డినేటర్ ఫరంగి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు విద్యార్థినీ విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని కోరారు తరగతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఈ అవకాశాన్ని నియోజక వర్గ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరిన్ని వివరాల కొరకు కళాశాలను సంప్రదించాలన్నారు

# ప్రజాస్వామ్యం పై విశ్వాసంతో నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

## - తహసిల్దార్ శ్రీరాములు




**బిజినపల్లి మేజర్ న్యూస్:** భారతదేశ పౌరులైన ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో నిష్పక్షపాతంగా ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెట్టి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసిల్దార్ శ్రీరాములు కోరారు గురువారం ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాసిల్దార్ కార్యాలయం ముందర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా ప్రతి పౌరులు తమ ఓటు హక్కును ప్రజాస్వామ్య బద్దంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు అనంతరం ఆయన మాట్లాడుతూ మతం కులవర్గ భాష బేధాలు లేకుండా ఎటువంటి ఒత్తిడి లకు ప్రభావితం కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు 18 సంవత్సరాలు నిండిన భారత పౌరులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు 18 సంవత్సరాల నుండి ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ రాజకుమార్ ఆర్ఐ బాలరాజు కార్యాలయ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శిక్షణ శిబిరంలో భాగంగా హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి మహిపాల్, కౌకుంట్ల శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నిరంజన్, శేఖర్ రమేష్ శేఖర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరాం ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేసిన నాయకులు



**అచ్చంపేట అర్బన్ మేజర్ న్యూస్:** గవర్నర్ కోటలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కి ఎమ్మెల్సీగా గవర్నర్ ఆమోదం తెలపడంపై తెలంగాణ జన సమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఐనోల్ వెంకటేష్ హర్షం రానున్న రోజుల్లో మంత్రి పదవిని సైతం కేటాయించాలని కోరారు వ్యక్తం చేశారు సమావేశంలో తెలంగాణ జన సమితి మండల యువజన విభాగం అధ్యక్షుడు అజయ్. విద్యార్థి జన సమితి మండల అధ్యక్షుడు గౌస్.పట్టణ కార్యదర్శి శ్రీను. మహేష్ .అంజి తదితరులు పాల్గొనడం జరిగింది

# ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో ప్రధానమైంది

## - 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి - అదనపు కలెక్టర్ కుమార్ దీపక్




**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** ప్రజాస్వామ్యంలో ఓటరుదే కీలకపాత్ర అని, దేశాభివృద్ధికి సుపరి పాలన అందించే మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటర్లకు ఉందని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భారత ఎన్నికల వ్యవస్థాపక దినోత్సవం, 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం నాగర్ కర్నూల్ ఐడిఓసి ప్రజావాణి మీటింగ్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై అధికారులు సిబ్బందితో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. భారత ఎన్నికల సంఘం రూపొందించిన మై భారత్ హెూమ్ పాటను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని, ప్రతి ఏడాది ఓటరు జాబితా సవరణ ఉంటుందని, 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలో చదువుతున్న 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించి ఓటర్ నమోదును చేయించాలని సూచించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుకున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. భారత ఎన్నికల కమిషన్ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. అంతకుముందు నాగర్ కర్నూల్ ఆర్డిఓ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా మైదానం నుండి ప్రభుత్వ జర్నల్ ఆస్పత్రి వరకు ఓటర్ చైతన్య అవగాహనపై విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ నర్సింగ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణా, జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, డిటి రఘు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి జీకే పరీక్ష పోటీల నిర్వహణ




**అచ్చంపేట అర్బన్ మేజర్‌న్యూస్:** క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ ఆదేశానుసారం డివిజన్ స్థాయిలో అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, కో చైర్మన్‌గా పాత్లావత్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగింది ఈ పోటీలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఫలితాలను వెల్లడించి తరగతి వారీగా మొదటి బహుమతులు, నగదు పురస్కారాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సహకరించిన దాత మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంధం రాజుకి అభినందనలు తెలిపారు కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ క్లాస్మేట్ క్లబ్ అధ్యక్షులు పెద్ది మురళి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సాయి ప్రసాద్, సభ్యులు అర్థం వినోద్, వాడకట్టు వినోద్, వజ్రమ్మ, ధనలక్ష్మి వెంకటేశ్వరరావు, సీనియర్ అధ్యాపకులు పాపిశెట్టి శ్రీనివాసులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా రామాలయంలో శ్రీ రమా సహిత వెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు



**నాగర్‌కర్నూల్, మేజర్‌న్యూస్:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో పుష్యా మాసం పౌర్ణమి సందర్భంగా గురువారంనాడు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు 12 మంది దంపతులతో సామూహికంగా భక్తులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వ్రతాలు చేయడంతో భక్తులకు కోరిన కోరికలు మరియు వారికి దారిద్ర్యం తొలగి,అష్ట ఐశ్వర్యాలు సిరి సంపదలు సిద్ధస్తాయని, విశేషంగా పుణ్య ఫలితం భక్తులకు అందుతుందని రామాలయం ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ అన్నారు. ఆలయం లో ప్రతి నెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నారని, గురువారం కావడంతో ఆలయ ఆవరణలో గల దత్తాత్రేయ స్వామికి పంచామృత విశేష అభిషేకం, ప్రత్యేక గురుదత్త పూజలు నిర్వహించారు. భగవంతుని అనుగ్రహం సూక్ష్మ మార్గంలో పొందుటకు,దోష నివారణ జరుగుటకు తమకు తోచిన విధంగా తమ శక్త్యానుసారం, పూజలు,వ్రతాలు నిర్వహించడంతో భగవంతుని ప్రసన్నం చేసుకొని వారి ఆపదలు తొలగి,కోరికలు నెరవేర్చే విధంగా స్వామి అనుగ్ర హిస్తాడనీ ఆయన తెలిపారు. ఆలయ ఆవరణలోని శివాలయంలో పరమశివుని భక్తులు దర్శించుకున్నారు. రామాలయ అన్నప్రసాద కమిటీ వారికి సామూహికంగా అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.నిత్య విష్ణుసహస్రనామ పారాయణ కమిటీ సభ్యులు,సాయి భక్తులు స్వామి వారిని కీర్తిస్తూ కీర్తనలు భజనలు చేశారు.భక్తులకు వేద ఆశీర్వచనం,తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే ఏర్పాటు చేసిన సామూహిక భోజనాలలో 525మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్న ప్రసాద కమిటీ సభ్యులు అర్థం రవీందర్, గొల్ల రాములు, టి.మల్లేష్, యాదగిరి,రమాదేవి, శారద, నంద కిషోర్,సాయి భక్తులు,నిత్య విష్ణు సహస్ర పారాయణం కమిటీ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి : ఆర్డిఓ శ్రీను నాయక్




**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్డిఓ శ్రీను నాయక్ తెలిపారు. గురువారం14వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నుండి పాలమూరు చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు, అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాముఖ్యతపై ఆర్డిఓ శ్రీను నాయక్ ప్రజలకు అవగాహన కలిగించారు, సీనియర్ సిటిజన్స్ లను శాలువతో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఇబ్రహీం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ బూత్ లెవెల్ కన్వీనర్‌ల సమావేశంలో మండల నాయకులు



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్:** మండల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం హైదరాబాదులోని జి. మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే నివాసం నుండి ఎల్బీ స్టేడియం లో నిర్వహించిన మండల తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూతు లెవల్ కన్వీనర్ల సమావేశం కు చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## నేడు కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు




**పాలమూరు మేజర్ న్యూస్ :** బిజెపి ప్రభుత్వము అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై నేడు జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టానున్నామని గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు కురుమూర్తి, రామ్మోహన్,రాములు,వర్ధ గాలెన్న తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక,రైతు, వ్యవసాయ, కూలీల వ్యతిరేక నిర్ణయాల కారణంగా నిరసన చేపట్టామన్నారు. జిల్లాలో జరుగు సమ్మెను విజయవంతం చేయాలని తెలిపారు.

## రేపు వాల్మీకి రామాలయంలో ప్రత్యేక పూజలు

**పాలమూరు మేజర్‌న్యూస్:** మహబూబ్ నగర్ పట్టణం నవాబుపేట రోడ్, కొత్తగంజి దగ్గరున్న వాల్మీకి రామాలయంలో రేపు 27వ తేది శనివారం నాడు మండల పూజ కార్యక్రమాలు చేపట్టానున్నామని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు యుగేందర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 కు గణపతి పూజ మండపారాధన, ఉదయం 9 గంటలకు ఉత్సవ విగ్రహాలకి ప్రాణ ప్రతిష్ట, ప్రతిష్ట చేసిన విగ్రహాలకి మండలాభిషేకం అలంకరణ, 10:30 గంలకు శివపార్వతుల కు కళ్యాణం జరుపుతున్నామని ప్రకటనలో తెలిపారు. అనంతరం మంగళహారతి తీర్థప్రసాదాల వితరరణ, అన్నదాన కార్యక్రమం చేయనున్నామని భక్తులు ఫాల్గొని స్వామి వారికృపకు పాత్రులుకాగలరని పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం




**తిమ్మాజిపేట మేజర్‌న్యూస్:** ఓటర్‌జాతీయ దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం తిమ్మాజిపేటలో అధికారులు పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు తిమ్మాజిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు జాతీయ ఓటర్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటారుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు మోహన్ ఎంపీడీవో కరుణశ్రీ ఎం ఈ ఓ శ్రీనివాసులు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురళి సీనియర్ అసిస్టెంట్ రవిచంద్ర ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**తిమ్మాజిపేట మేజర్ న్యూస్ :** మండలకేంద్రం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లికి చెందిన జక్కా సత్యనారాయణ ( 50) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ గ్రామానికి తన కూతురు ఇంటికి బుధవారం వెళ్ళాడు గురువారం ఉదయం తన స్వగ్రామం కొత్తపల్లికి వెళుతుండగా మార్గ మధ్యంలో తిమ్మాజిపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఆయన తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆసుపత్రికి తరలించామని మృతుడి కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగ మృతుడికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు.

# సమాజ చైతన్యానికి కలలు దోహదపడతాయి

### - పిఎన్ఎం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**అలంపూర్ మేజర్ న్యూస్/:** సమాజ చైతన్యానికి సాహిత్యం కలలు కళాకారులు దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా ప్రజానాట్యమండల ఆధ్వర్యంలో అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంమ్ గారి భాస్కర్, ఎం.ఇ.ఓ అశోక్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర స్ఫూర్తి చిన్నతనం నుండే విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కలల ద్వారానే సామాజిక చైతన్యం కలుగుతుందన్నారు. కుల మతాలకతీతంగా సమాజంలో అందరూ సమానంగా జీవించాలని సూచించారు. దేశభక్తి పైన విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయని కొనియాడారు. 11 పాఠశాలల నుండి 132 మంది విద్యార్థులు 28 కళారూపాలను ప్రదర్శించారు. మద్యపాన నిషేధం పైన హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, ఉపాధ్యాయురాలు భారతి, సుశీలమ్మ పాటలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రం, మెడల్స్, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలాజీ, వెంకట్ రంగయ్య, జి నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు అలీ అక్బర్, కార్యదర్శి ఆశన్న, రిటైర్డ్ తెలుగు పండితులు వెంకట్రామయ్య సెట్టి, ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు సుశీలమ్మ, సుగుణమ్మ, దీప, సంతోషిని, రూప, ధనలక్ష్మి, రాణి, సుజ్ఞానం, బై రోజు రాజశేఖర్, బలగం నాగరాజు, వెంకట నాయుడు, రాములమ్మ, బాలస్వామి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాలూకా గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు



**మక్తల్, రూరల్ మేజర్ న్యూస్:** మక్తల్ మండల కేంద్రంలోని కిరాణా అసోసియేషన్ భవనంలో వైద్య విజ్ఞాన సదస్సును తాలూకా గ్రామీణ వైద్య సేవకుల సంఘం అధ్యక్షులు రూమళ్ళ సిద్రామేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ వైద్య విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ ఆర్.యం.పి, పి.యం.పి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, మహబూబ్ నగర్ సాన్వి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్: వాసు చైతన్య, హాజరై వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్.యం.పీ, పీ.యం.పీ వైద్యులు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేసి, రోగి పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం నిపుణులైన వైద్యుల వద్దకు రెఫర్ చేయాలని అన్నారు. తాలూకా గ్రామీణ వైద్య సేవకుల సంఘం అధ్యక్షులు రూమళ్ళ సిద్రామేశ్వర్, మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలకు ఆర్.యం.పీ, పీ.యం.పీలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్.యం.పీ లను ప్రభుత్వం గుర్తించి తక్షణమే వాళ్లకు శిక్షణ ఇచ్చి ఫస్ట్ యాడ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతో పాటు 50ఏళ్లు దాటిన ఆర్.యం.పీ,లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలను అందించరాదన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, డాక్టర్: వాసు చైతన్య,తో పాటు హాస్పిటల్ పిఆర్ఓ యం.అరుణ్‌కుమార్‌ను ఆర్.యం.పీ, పి.యం.పి వైద్యులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాధ్వార్ ఆశప్ప, మక్తల్ మండల అధ్యక్షులు ఎస్.చక్రధర్, నర్వ మండల అధ్యక్షులు నర్సన్ గౌడ్, ఆర్.యం.పీలు, సూర్య ప్రకాష్ రెడ్డి, కర్ని భగవంతు, శంకర్, లక్ష్మీపతి,రఘు, సోమశేఖర్,లింగారెడ్డి,రుకియా బేగం,ఆనంద్,రవి,ఆంజనేయులు,దశరథ్, వెంకటేష్, రామకృష్ణ,గోవింద్, తయాప్ప, మోహన్ పాల్గొన్నారు

## ఘనంగా మటమారయ్య మహాస్వామి జయంతి వేడుకలు





**మక్తల్,రూరల్ మేజర్ న్యూస్:** నీలగిరి సాలి మఠం సుక్షేత్ర రాయచూర్ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మటమారయ్య మహా స్వామి 156 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నీలగిరి సాలి మఠం ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మటమారయ్య మహాస్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల పండుగ పేరుతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నీలగిరి సాలిమఠం ప్రచార సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళంపల్లి అనిల్ మాట్లాడుతూ సమాజంలో భక్తి భావాన్ని పెంపొందించడం సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించడమే శ్రీ నీలగిరి సాలి మఠం ప్రచార సేవా సమితి లక్ష్యమని అన్నారు. స్వామీజీ లు మఠాలను ఏర్పాటు చేసి ప్రజలను సన్మార్గంలో నడిపించారని అన్నారు. అలాంటి మఠాలలో కర్ణాటక లోని రాయిచూర్ లో వెలసిన శ్రీ నీలగిరి సాలి మఠం ఒకటని తెలిపారు .శ్రీ నీలగిరి సాలి మఠం ఎంతో మహిమాన్వితమైనదని అన్నారు. పీఠాధిపతిగా మటమారయ్య మహాస్వామి వారు ఎన్నో ధార్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సూగురయ్య మహా స్వామి వారి మార్గదర్శనంలో నీలగిరి సాలి మఠం ప్రచార సేవా సమితి సభ్యులు స్వామి వారి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా స్వామివారి సేవలో భాగంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కరోనా మంటి విపత్కర పరిస్థితుల్లో నీలగిరి సాలిమఠం ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీ నిలిగిరి సాలి మఠం ప్రచార సేవా సమితి సభ్యులు అశోక్ గౌడ్ గురు స్వామి ,బి.రామలింగప్ప ,బి.శ్రీనివాసులు, అమరచింత మండల అధ్యక్షుడు కమలాకర్ గౌడ్ ,సురేందర్ గౌడ్ ,వాకిటి రమేష్, శివారెడ్డి, విజయ్ గౌడ్ ,రంగారెడ్డి పాల్గొన్నారు.

## గ్రంథాలయని ప్రారంభించిన సర్పంచ్ ఎంపిటిసి



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉల్లిగుండం గ్రామంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం చేశారు .గ్రామ ఇరువర్గాల మధ్య తగాదాలతో గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించలేదు దీనితో గ్రామ సర్పంచ్ ఎంపిటిసి కిషన్ రావు సర్పంచ్ కిష్టారెడ్డి చొరవ తీసుకొని గ్రంథాలయాన్ని ప్రారంభించారు దీంతో గ్రామంలో ఇరువర్గాలు మధ్య రాజకీయం వేడెక్కింది

## వంశీచంద్ రెడ్డి ఓటమి భయంతోనే ఆరోపణలు
## - మాజీ మంత్రి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పై ఆరోపణలు తగదు
## - బిజెపి జిల్లా అధ్యక్షు డు పి. శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్ :** కాంగ్రెస్ నాయకులు వంశీచంద్ రెడ్డి మాజీ మంత్రి ,జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పై ఆరోపణలు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా బిజెపి అధ్యక్షులు బీసీ నర్సిరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 2018 ఎన్నికల్లో ఎందుకు గుర్తుకు రాలేదని ,ఐదేళ్లు గడిచిన తర్వాత మాజీ మంత్రి డీకే అరుణ పై తప్పుడు ఆరోపణలు చేయడం వంశీచందర్ కు తగదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయం తోనే కాంగ్రెస్ నాయకులు వంశీచందర్ రెడ్డి బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.వంశీ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తన వ్యాఖ్యలు వంశీచందర్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న సినీ హీరో నవదీప్



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** అష్టదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం రోజు సినీ నటుడు నవదీప్ ఆలయాలను దర్శించుకున్నారు. అంతకుముందు వీరికి ఆలయ ఈవో పురేందర్ కుమార్ అర్చకులుపూర్ణకుమంతో స్వాగతం పలికారు. ఆలయాల విశిష్టతల గురించి ఆలయ అర్చకులు వారికి వివరించారు స్వామివారి ఆలయంలో అభిషేకం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయాలు చాలా అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్రంలోని అష్టదశ శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ దేవి అమ్మవారి ఆలయం బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంతో పాటు నవబ్రహ్మ ఆలయాలు చాలా చక్కగా ఇక్కడ నిర్మించబడడం చాలా సంతోషకరమని హీరో నవదీప్ అన్నారు.

## గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గద్వాల మేజర్ న్యూస్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్లో అన్ని ఏర్పా ట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. త్రాగు నీరు, వైద్య సదుపాయం, టాయిలెట్స్, ఇతర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. స్టేజి ప్రోటోకాల్ ప్రకారం స్టేజి పై సీటింగ్ ఏర్పాటు చేయాలనీ, సందర్శకులు వచ్చిన వారికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. బారికేడ్లు వీఐపీల వసతులు, పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, ఆర్.డి.ఓ చంద్రకళ, ఎ.ఓ వీరబద్రప్ప, డి.సి.ఓ రేవతి , డి.ఆర్.డి.ఎ ఉమా దేవి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ఆర్అండ్‌బి ప్రగతి, విమల, డిపిఆర్ఓ చెన్నమ్మ, తహసిల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కౌకుంట్ల మండలంలో శివ మాల దీక్ష



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండల కేంద్రంలో శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి శివమాల దీక్ష స్థానిక శివాలయంలో శివమలాధారణ స్వీకరణ, గోపన్ పల్లి మఠం సురేష్ స్వామి ఆధ్వర్యంలో వేయడం జరిగింది. కౌకుంట్ల మండల కేంద్రంలోని పుట్ట పల్లి, గోపన్ పల్లి ,రాజోలి , ఇస్రంపల్లి గ్రామాలలో దాదాపు 100 మంది శివ స్వాములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
## - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**వనపర్తి ప్రతినిధి మేజర్‌న్యూస్:** సమాజంలో కులం, వర్గం, ప్రాంతం, జాతి బేధాలు లేకుండా భారత రాజ్యాంగం ఓటు 18 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందని అన్నారు. అంతే బాధ్యతతో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగపరచుకుని నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. గురువారం 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐ.డి.. ఒ.సి నుండి వనపర్తి పట్టణంలోని ప్రధాన కుడళ్ల గుండా జాతీయ పతాకాలు చేతబూని బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో





జిల్లా కలెక్టర్ స్వయంగా బైక్ నడుపుచు నాయకత్వం వహించారు. ఈ బైక్ ర్యాలీలో అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, ఇందిరా పార్క్, రాజీవ్ చౌక్ మీదుగా సాగి.. తిరిగి కలెక్టర్ కార్యాలయం కు చేరుకుంది. అనంతరం కలెక్టరేట్ లో ఎన్నికల స్వీప్ యాక్టివిటీ పై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు ను వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకొని బలమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రలోభాలకు గురిచేయకుండా ఇటు ప్రజా పరిటినిధులు, అటు ప్రజలు ప్రలోభాలకు ఆశ పడకుండా నైతికత తో ఓటు వేసే విధంగా కృషి చేయాలని సూచించారు. వనపర్తి జిల్లాలోఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు అందరూ బాగా పని చేశారని, ఒక్క కేసు నమోదు కాకుండా ఎన్నికలు జరగడం అభినందనీయమన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒకరి శ్రమ వల్లే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో మీడియా పాత్ర సైతం చాలా ప్రశంసనీయమైనదని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో సైతం ఫేక్ వార్తల పట్ల అందరూ అప్రమత్తంగ ఉండాలని ఏదైనా తప్పుడు వార్తవస్తె వెంటనే ఖండించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఓటరు అవగాహన ఫోరమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ వోట్ ఫర్ ష్యూర్' అనేది ఈసారి ఎన్నికల థీమ్ గా చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ జనవరి 25న ఎన్నికల సంఘం ప్రారంభమైందని అందుకే ఈ రోజు ఓటరు దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్ తిరుపతి రావు జాతీయ ఓటరు దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రధానంగా 4 అంశాల అమలుకు జాతీయ ఓటరు దినోత్సవం జనవరి, 25 2011 న మొదటిసారి ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం, ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవడం, చనిపోయిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓటును తొలగించడం, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓటు వేసేవిధంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం 18 ఏళ్లు నిండిన కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారికి, సీనియర్ సిటిజన్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, పాటలు, వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ అదనపు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

## ఆలయాలను అభివృద్ధి చేసి చూపిస్తాం - ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య



**అలంపూర్ మేజర్ న్యూస్/:** శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము నందు చేపట్ట వలసిన పలు అభివృద్ధి పనుల గురించి దేవాదాయ శాఖ కమీషనర్ గారి ఆదేశముల మేరకు దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ కనక దుర్గా ప్రసాద్, డిప్యూటీ ఇంజనీర్ శ్రీ వేమూరి శ్రీనివాస శర్మ గార్లు ఈ రోజు 25.01.2024 గురు వారము నాడు ఆలయమునకు విచ్చేసి ఆలయము నందు ప్రస్తుతము క్యూ లైన్లలో లో ఉన్న ఐరన్ రేయిలింగ్ స్థానములో స్టైయిన్ లెస్ స్టీల్ తో తయారు చేయుటకు, శ్రీ అమ్మవారి ఆలయములో ప్రస్తుతము ఉన్న బండ పరుపు కుంగి పోయి హెచ్చు తగ్గులుగా వున్నందున వాటి స్థానములో నూతన బండ పరుపు వేయుటకు, యాగశాల ప్రక్కన గల ఖాళీ స్థలములో భక్తుల సౌకర్యార్థం షెడ్ వేయుటకు, దేవస్థాన అదీనమున గల పాత ఆసుపత్రి స్థలములో భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం, కాలక్షేప మండపము, వసతి గదులు, మీటింగ్ హాల్ మొదలైన నిర్మాణములు చేపట్టుటకు, మరియు కర్నూల్ జిల్లా, కల్లూరు నందు గల దేవస్థాన భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, కళ్యాణ మండపము నిర్మాణము చెపట్టుటకు గాను వీటిని పరిశీలించి, వీటిని ఏర్పాటు చేయుటకు కొలతలు సేకరించడం జరిగినది. పై తెలిపిన పనులకు అవసరమైన ప్లాన్స్ %ఆ% ఎస్టిమేట్స్ తయారు చేసి, ఈ పనులను త్వరగా ప్రారంభిస్థామని, అలాగే మంటెసరి స్కూల్ దగ్గర చేపట్టనున్న శాశ్వత ఆర్చ్ గేట్ నిర్మాణము స్థలమును కూడా పరిశీలించి ఈ పనులను కూడా వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని ఆలయ ఈ.ఓ. పురెందర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమము నందు ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ధర్మకర్త వెంకట నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలను ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు





**ఉండవెల్లి మేజర్ న్యూస్:** గురువారం మండల పరిధిలోని బోరవెల్లి గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలకు హాజరై ప్రారంభించి రెండు టీమ్ లకు టాస్ ఎగరటం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవ స్వామి జాతరను పురస్కరించుకొని కబడ్డీ పోటీలను నిర్వహించడం చాలా సంతోషకరం అన్నారు. కబడ్డీ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి. అదేవిధంగా గ్రామ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు ఐక్యతతో గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు దేవుని ఆశీస్సులతో గ్రామంలోని రైతులు, ప్రజలు, అన్ని వర్గాల ప్రజలు దినదినాభివృద్ధి చెందాలని, ఆయురారోగ్యాలతో సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోరవెల్లి సత్యారెడ్డి,వైస్ ఎంపీపీ సోమన్న గౌడ్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గోపాల్,ఎల్లారెడ్డి, సీతారాముడు, మానవపాడు దామోదర్ రెడ్డి, వెంకట్రాముడు, అమరవాయి కాంతారెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, గోపాల్, మల్లికార్జున్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నరేందర్ రెడ్డి,గ్రామ పెద్దలు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శుక్రవారం
26 జనవరి 2024

# ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**మిడ్జిల్ మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసిల్దార్ రాజు నాయక్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మాత్రమే స్వేచ్ఛకు అవకాశం ఉంటుందని ముఖ్యంగా యువత విద్యార్థులకు ఓటు హక్కును వినియోగించుకోవాలి అధిక శాతం గ్రామీణ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజ్యాంగాన్ని గౌరవించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

**మక్తల్,రూరల్ మేజర్ న్యూస్:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మఖ్తల్ తహసిల్దార్ సువర్ణరాజ్, డిప్యూటీ తహశీల్దార్ పుష్పలత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని తహసిల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని, సరైన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఓటు హక్కుతోనే బంగారు భవిత అన్నారు. అనంతరం అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యస్.ఐ పర్వతాలు, జీ.హెచ్.యం అనిల్ గౌడ్, పీఈటీ పరంజ్యోతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్ రావు, సిబ్బంది నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

***ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి***
***–రెవిన్యూ అదనపు కలెక్టర్ ఎస్ మోహన్ రావు***

**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్:** ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినయోగించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్ రావు అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమొదు చేసుకొని ఓటు ద్వారా ప్రజా స్వామ్యన్నీ పరిరక్షించాలనీ ఆయన కోరారు గురువారం మహబూబ్ నగర్ స్టేడియం గ్రౌండ్ వద్ద 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు అవగాహన కై నిర్వహించిన ర్యాలి ని అదనపు కలెక్టర్ లు ఎస్. మోహన్ రావు, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,లు జెండా ఊపీ ప్రారంబించారు. ఈ ర్యాలి స్టేడియం గ్రౌండ్ నుండీ ప్రారంభమై బస్టాండ్ మీదుగా తెలంగాణ చౌరస్తా ను చుట్టి ఎన్టీఆర్ కాలేజీ వరకు నిర్వహించారు ఈ సందర్బంగా స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటుహక్కును వినయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంక్షేమ అధికారి శ్రీనివాసులు, అర్బన్ తహసిల్దార్ రాధాకృష్ణ, డిప్యూటీ తహసిల్దారు రాజగోపాల్, ఎంఎస్ కళాశాల లెక్చరర్ విజయ్ కుమార్ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

***ఓటును ప్రతి ఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలని***
***– జిల్లా అదనపు ఎస్పీ ఎన్. రవి***

గద్వాల మేజర్ న్యూస్: భవిష్యత్ ను నిర్ణయించే ఓటును 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్. రవి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్బంగా జిల్లా పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అధికారులు, సిబ్బంది తో అదనపు ఎస్పీ మాట్లాడుతూ మనం వేసే ఓట్లు మన పిల్లల భవిష్యత్ ను నిర్ణయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బి, డీసీ ఆర్బి , సీసీ ఎస్ ఇన్స్పెక్టర్స్ భగవంత్ రెడ్డి, శివకుమార్, రామ స్వామి, కార్యాలయ సూపరింటెండెంట్‌లు నాగేందర్, నయీం, ఐటీ సెల్ సిబ్బంది, డీసీ ఆర్బీ సిబ్బంది, ఎస్బి సిబ్బంది మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**చిన్నచింతకుంట మేజర్‌న్యూస్.:** జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తహసిల్దార్ సి .కృష్ణయ్య ఆధ్వర్యంలో పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు. తహసిల్దార్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మాత్రమే స్వేచ్ఛకు అవకాశం ఉంటుందని ముఖ్యంగా యువత విద్యార్థులకు ఓటు హక్కును వినియోగించుకోవాలి అధిక శాతం గ్రామీణ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజ్యాంగాన్ని గౌరవించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు తెలియజేశారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మండల కో ఆప్షన్ సభ్యులు మహమూద్ ఎస్సై ఆర్ శేఖర్ డిప్యూటీ తహసిల్దార్ శేఖర్ మండల గిర్ధవర్ లు తిరుపతి. శశికిరణ్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉపాధ్యాయులు ముక్తార్ నరసింహులు గౌడ్ పిఈటి వేణుగోపాల్ జూనియర్ అసిస్టెంట్. %ఖ% రాములు సింగల్ విండో మాజీ డైరెక్టర్ జి.ఫీలోగ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు రామాంజనేయులు కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






























***నూతన ఓటర్ల అవగాహన భాగంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మార్వో – ఎన్ అనిల్ కుమార్***

**కొత్తపల్లి మేజర్ న్యూస్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం కొత్తపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్వో అనిల్ కుమార్ యుపిఎస్ స్కూల్ విద్యార్థులు తహసిల్దార్ ఎన్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీగా నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మాత్రమే స్వేచ్ఛకు అవకాశం ఉంటుందని ముఖ్యంగా ప్రతి ఇంటిలో ప్రతి సంవత్సరం వయోజనులు ఉంటారు ఇంటర్ డిగ్రీ అక్కా, అక్కలు చెల్లెళ్లు అన్నలు తమ్ముళ్లు ప్రతి ఒక్కరు కూడా ఓటును వినియోగించుకోవాలని వివరించారు. ఓటర్స్ దినోత్సవ సందర్భంగా గ్రామ పెద్దలు అయినవంటి మాజీ ఎంపిటిసి బాల్ రెడ్డి, కావలి వెంకటయ్యని ఎలక్షన్‌లో ఓటేసేటప్పుడు గ్రావ పెద్దల సహకారం ఉంటుందని. అందుకు సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అనిల్ కుమార్, స్కూల్ హెడ్మాస్టర్ బుచ్చయ్య, కొత్తపల్లి మండల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నరేష్, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది అంగన్వాడి టీచర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

***ప్రజాస్వామ్యం ఓటు ఎంతో విలువైనది – కలెక్టర్ బి ఎం. సంతోష్***

**గద్వాల మేజర్ న్యూస్:** ప్రజాస్వామ్యంలో పవిత్రమైనది, ఎంతో విలువైనది ఓటు హక్కు అని , ప్రజాస్వామ్యం సజావుగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన యువతీ యువకులు అందరు తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి ఎం. సంతోష్ అన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా నుండి పాతబస్టాండ్ రాజీవ్ చౌక్ వరకు 14 వ జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును ఓటరు జాబితా లో నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, కల్లెక్టరేట్ సిబంది అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశం లోజిల్లా అదనపు కల్లెక్టర్లు అపుర్వ్ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్డిఓ చంద్ర కళ, స్పోర్ట్స్ అధికారి బిఎస్ఆనంద్, డిపిఆర్ ఓ చెన్నమ్మ, మున్సిపల్ కమిషనర్ నరషింహ, హృదయరాజు ఎంఆర్ఓ వెంకటేశ్వర్లు, సుపరింతెన్దేంట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**లింగాల, మేజర్‌న్యూస్:** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధమని, రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకొని ప్రజాస్వామ్యం బలోపేతానికి కృషి చేయాలని తాసిల్దార్ ఉమ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని తాసిల్దార్ కార్యాలయం నుండి ప్రధాన రహదారి గుండా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు మానవహారం ఏర్పడి ఐక్యతను చాటారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, వీఆర్ఏ సతీష్, లింగాల హై స్కూల్ హెచ్ఎం శేఖర్, పిడి స్వరూప, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

***ఓటును ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి : తాసిల్దార్ మంజుల***

**అలంపూర్ మేజర్ న్యూస్:** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ యొక్క ఓటును 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా వినియోగించుకోవాలని అల్లంపూర్ తాసిల్దార్ మంజుల అన్నారు. గురువారం రోజు అల్లంపూర్ పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం దగ్గర పెద్ద ఎత్తున ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల చేత ముందుగా మౌన హారం ఏర్పాటు చేసి ఓటు పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మంజుల మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మనం వేసే ఓటు మన పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి వేణుగోపాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కృష్ణ మేజర్‌న్యూస్:** ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా వేసే ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రధానోపాధ్యాయులు,ఢి.శేఖర్, ఉపాధ్యాయులు నల్లే శివరాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఖాన్ దొడ్డి ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని గ్రామ పురవీధుల్ల గుండా విద్యార్థుల చేత ఓటరు చైతన్య అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. శేఖర్, ఉపాధ్యాయులు నల్ల శివరాజ్, వెంకటేష్, గ్రామ సర్పంచ్ జయలక్ష్మి తిప్పయ్య, ఉప సర్పంచ్ అశోక్, ఎస్ఎంసి చైర్మన్ మల్లికార్జున్, లక్ష్మి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ జి అనిత, ఆంజనేయులు ,దత్తు ఆనంద్, వెంకటేష్, పాపయ్య, నాగేశ్ ,రాజు, తాయప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండల కేంద్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలంటూ గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని మరికల్ మండల కేంద్రంలోని పలు వార్డులలో నినాదాలు చేసుకుంటూ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇందిరాగాంధీ చౌరస్తాలో, నిలబడి ఈ విషయమై మండల తాసిల్దార్ సునీత మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, వారు సూచించారు, ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్ఐ, శ్రీశైలం, సూపర్డెంట్ శంకరయ్య, అంగన్వాడి కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 28న పాలమూరుకు అమిత్ షా

### - సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బిజెపి నాయకులు



**మహబూబ్ నగర్ ,మేజర్ న్యూస్:** ఈ నెల 28న జరిగే పార్లమెంటు స్థాయి సమీక్ష సమావేశనికి కేంద్ర హెూం మంత్రి బిజెపి అగ్ర నేత అమిత్ షా హాజరుకానున్నారు. ఈ సమావేశం పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ముఖ్య నాయకులతో జరుగుతుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న అమిత్ షా సభను జిల్లా కేంద్రంలోని రాజ బహదూర్ రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ముందస్తుగా సమావేశం ఏర్పాట్లను బిజెపి నాయకులు పరిశీలించారు ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఏపీ జితేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ బిజెపి రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు పి శ్రీనివాస్ రెడ్డి , అసెంబ్లీ కన్వీనర్ అచ్చుగట్ల అంజయ్య, బిజెపి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**అల్లంపూర్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని రేలంపాడు జిల్లాలపాడు నూతన గ్రామపంచాయతీ భవనాలను అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు గురువారం రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో చేపడతానని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలు పలు అభివృద్ధి ఆ పనులను చేపడతానని ప్రజలు కూడా సహాయ సహకారాలు అందించాలని ఎవరు ఎలాంటి ఇబ్బందులకు లోను కావద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సర్పంచ్ శ్రీనివాసులు ర్యాలంపాడు సర్పంచ్ కుబ్రా ర్యాలంపాడు ఉప సర్పంచ్ జి రాముడు గ్రామస్తులు షేక్ అహ్మద్ బాబు షఫీ మద్దయ్య మహేష్ డీలర్ నరసింహుడు లాలన్న వాసు మురళి రుక్కు పాల్గొన్నారు.

## 28 నుండి వర్సిటీ డిగ్రీ తరగతులు

**మహబూబ్నగర్ విద్యా విభాగం మేజర్ న్యూస్:** ఎంవిఎస్ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరం ఒకటవ సెమిస్టర్ కౌన్సిలింగ్ తరగతులు 28 నుండి ప్రారంభమవుతాయని ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. పద్మావతి మరియు రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. సత్యనారాయణ గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించిన రసీదులు , యూనివర్సిటీ అందించిన పుస్తకాలు తమ వెంట తీసుకురావాలన్నారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరుకావాలని కోరారు.

## తవ్వారు వదిలేశారు



**వడ్డేపల్లి మేజర్ న్యూస్:** వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు ఒకటో వార్డులో వాల్మీకి గుడి దగ్గర గత 15 రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి నీరు వృధాగా రోడ్డుపై పారుతుంది. గత నాలుగు రోజుల క్రితం లీకైన ప్రదేశంలో సిబ్బంది లీక్ అవుతున్న పాయింటు దగ్గర తవ్వడం జరిగింది మిషన్ భగీరథ పైపుపగిలిన పాయింటు దొరకపోవడంతో అలాగే వదిలేశారు .ఈ కాలనీలో పిల్లలు కూలీలు వృద్దులు రద్దీగా తిరిగే ఈ ప్రదేశంలో వస్తుంటారు పోతుంటారు నీళ్లు కొన్నిచోట్ల సరఫరా ఉంటే మరికొన్ని చోట్ల సరఫరాలో తీవ్ర అంతేరాయంగా ఉన్నది. పలుచోట్ల త్రాగునీరు పైపులు పగిలి వాటిలో మురుగునీరు కలుస్తున్న దాఖలాలు ఉన్నాయి. అధికారుల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విలువైన త్రాగునీరు రోడ్డుపై పొంగిపొర్లుతుంది .లీకేజీలతో నీరు వృధాగా వెళుతుంది మరవతల కోసం రోడ్డు తవ్వారు కానీ మరమ్మతులు ఏమాత్రం మరిచారో మీరే చూడండి ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ సమస్యను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# ఈద్గా నిర్మాణాల్లో అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

### - నిరూపణ కాకపోతే మీ పదవికి రాజీనామా చేస్తారా ? - పిఏసీఎస్ ఛైర్మన్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్



**గద్వాల మేజర్ న్యూస్:** ఈద్గా నిర్మాణాల్లో అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధంగా ఉన్నామని.. మరి నిరూపణ కాకపోతే మీ పదవికి రాజీనామా చేస్తారా అని పిఏసీఎస్ ఛైర్మన్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్ సవాల్ విసిరారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రైవేటు భవనంలో ఈద్గా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జడ్పీ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ సరిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు పై ఆగ్రహంతో ఈద్గా నిర్మాణం పనిలో అవినీతి జరిగిందని ఆరోపించారని, గతంలో ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం రంజాన్, బక్రీద్ పండుగలకు ఈ ప్రాంత నాయకులు, ఎమ్మెల్యేలు, 5 మీనార్ ఈద్గాను 7 మీనార్ల ఈద్గాగా నిర్మాణం చేస్తామని మాయ మాటలు చెప్పడం జరిగిందని, మాయ మాటలు మోసపు మాటలతో ఎన్నికల సమయంలో మైనార్టీ ఓట్లను దన్నుకోవడం జరిగింది తప్పా ఎటువంటి పురోగతి చూపించలేదన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహాయ సహకారాలతో నూతన ఈదుగా నిర్మాణానికి రూ.2 కోట్ల 25 లక్షల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. దీనిలో రూ.1.5 లక్షల మంజూరు అయినదన్నారు. ఇప్పటివరకు ఈద్గా నిర్మాణంలో మినార్లను, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపుగా 90 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందని, వచ్చే రంజాన్ మాసం నాటికీ పూర్తి చేస్తామని అదేవిధంగా ఎమ్మెల్యే దూర దృష్టితో ఆలోచించి ఈద్గా నిర్మాణం చారిత్రకమైన కట్టడంగా ఉండిపోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఈద్గా నిర్మాణానికి రాయిని తెప్పియడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే తన వంతు ఆర్థిక సాయం అందిస్తూ మరికొంత మంది మత పెద్దలు, మైనార్టీ నాయకులు కూడా ఈద్గా నిర్మాణానికి విరాళాలు(చందాలు) అందించారన్నారు. వీరి అందరి మైనార్టీ సోదరులు కలిసి ఈదుగా లోని మినార్లు, కమాన్లు ఏర్పాటు చేసుకునే విధంగా కృషి చేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు. కొంత మంది మైనార్టీ నాయకులు విష ప్రచారం సృష్టిస్తూ ఈద్గాలో అవినీతి జరుగుతుందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని పరిగణలోకి తీసుకొని మీరు ఇలాంటి నాయకుల మాటలు నమ్మి ఈద్గాలో అవినీతి జరుగుతుందని చెప్పడం సరైనది కాదన్నారు. మీరు జడ్పీ ఛైర్మన్ పదవి పొంది నాలుగు సంవత్సరాలు కావడం జరుగుతుంది, ఏనాడు.. మైనార్టీల సంక్షేమం కోసం గానీ, అభివృద్ధి కోసం గాని, ఈద్గా నిర్మాణం కోసం గానీ ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. మరి ఇప్పుడు వచ్చి ఈద్గా నిర్మాణం పనులను పరిశీలించి వీటిలో అవినీతి జరుగుతుంది అని మాట్లాడడం సరైనది కాదు అని తెలిపారు. ఈద్గా నిర్మాణంలో అవినీతి జరిగిందని నిరూపిస్తే ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు మాజిద్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఖలీల్, మైనార్టీ నాయకులు మన్సూర్, రిజ్వాన్, మోబీన్ , కూరగాయల మహబూబ్, అన్వర్, మహబూబ్, సీసాల భాషా, రెహమాన్ , మోసిన్, అన్వర్, అబ్బు తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలు

### - జిల్లా కలెక్టర్ పి .ఉదయ్ కుమార్

**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అసౌకర్యం కలగకుండా జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలను నేటి నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ పి ఉదయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ తాహసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఒక ఆధార్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ప్రజలు ఆధార్ అప్డేషన్ కేవైసీ కోసం వస్తున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని నాగర్ కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం బిజినపల్లి తాహసిల్దార్ కార్యాలయం తాడూరు తాహసిల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 31వ తేదీ వరకు తాత్కాలికంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆయా ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

# పనుల విషయంలో రాజి లేదు : ఎమ్మెల్యే చిట్టెం పర్ణి క రెడ్డి





**దామరగిద్ద మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధి తమ ధ్యేయమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికారెడ్డి అన్నారు. గురువారం దామరగిద్ద కేంద్రంలో క్రికెట్ క్రీడలను ప్రారంభి%శీ% చారు అనంతరం అక్కడనుండి దేశయిపల్లి లో నూతనంగా 20 లక్షలతో నిర్మించబడ్డ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు, మల్ రెడ్డిపల్లి గ్రామంలో మన ఊరి మనబడి కార్యక్రమంలో భాగంగా 46 లక్షలతో అదనపు పాఠశాల భవనం టాయిలెట్స్ ప్రహరీ గోడ నిర్మాణన్ని ప్రారంభించి అక్కడనుండి నర్సాపూర్ గ్రామ శివారులోని ఆంజనేయుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ ప్రారంభోత్సవం చేశారు అనంతరం ఉలిగుండం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ కలిసి రావాలని అన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు



గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందె విధంగా చూస్తామన్నారు తప్పకుండ. ఎల్లపుడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు దేశయి పల్లి మల్ రెడ్డి పల్లి లో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డిని ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఎంపిపి నర్సాప్ప, జడ్పీటిసి లావణ్య సింగిల్ విండో అధ్యక్షుడు ఈదప్ప అయ గ్రామాల సర్పంచులు వెంకటమ్మ, ఇరప్ప, కిష్టారెడ్డి ఎంపిటిసి కిషన్ రావు మండల పార్టీ అధ్యక్షుడు బాల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్ల ఎస్టీ సెల్ అధ్యక్షుడు శరణ్ నాయక్ జిల్ల మైనార్టీ విభాగం నాయకులు ఖాజా ముదిరాజ్ జిల్ల నాయకుడు మ్యాకలి హన్మంతు ,మండల పార్టీ యువనాయకులు బసుదే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# బిఎల్ఏల సమావేశానికి హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు



**శ్రీరంగాపూర్ మేజర్‌న్యూస్:** తెటలంగాణ రాష్ట్రస్థాయి బిఎల్ఏల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే గారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్రస్థాయి బిఎల్ఎ ల మీటింగ్ కు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేస్తున్న సందర్భంగా శ్రీరంగాపూర్ మండల్ నుంచి హైదరాబాద్ ఎల్బీ స్టేడియం కు శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్ సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్ బిఎల్ఎ మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ బిఎల్ఎ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు భీమ్మనా, చందు, ఆనంద్, హరిప్రసాద్ గౌడ్ ఇమ్రాన్, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.